

దీక్ష చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

13న ఆమనగల్లులో బీఆర్ఎస్ రైతు నిరసన దీక్ష

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక
- దీక్షా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ఈనెల 13న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుదీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, ఆరు గ్యారెంటీల అమలుపరచకపోవడాన్ని నిరసిస్తూ నిర్వహించే రైతు దీక్షకు కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి 10 వేల మందిని సమీకరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం బస్టాండ్ సమీపంలోని తలకొండపల్లి రోడ్డులో రైతుదీక్షకు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీలు అనురాధ, ద్యాప విజితారెడ్డి, దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి జైపాల్ యాదవ్ స్థలాన్ని పరిశీలించారు. 13వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే రైతుదీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేనావత్ పత్యానాయక్, సయ్యద్ ఖలీల్, రమేశ్ నాయక్, నాగిళ్ల జగన్, శ్రీను నాయక్, వెంకటేశ్, రమేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఆర్ఏ వారసులు

వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

- కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్ఏల వారసులు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య (వారసత్వ) నియామకాల కోసం జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన వారసులకు ఉద్యోగ నియామకం కోసం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ జీవోలపై స్టే ఉన్నందున నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని, 2023 డిసెంబర్ 21న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల ప్రకారం 81 జీవోపై స్టే ఎత్తివేసినట్లు చెప్పారు. తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి

పశుగణనను సమగ్రంగా చేపట్టాలి

కడ్తాల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాల వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 21వ పశుగణన సర్వే జిల్లావ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. కడ్తాల పశు వైద్యశాలను గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పశుగణన, గొర్రెలు, మేకల వ్యాక్సినేషన్ కార్యక్రమం, జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమాల గురించి వెటర్నరీ డాక్టర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పశుగణనను పకడ్బందీగా చేపట్టాలన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పశువులకు వైద్యం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లలిత, జీవోఎం సుధాకర్ గౌడ్, పశువైద్య అధికారి భానునాయక్ ఉన్నారు.

అక్రమ లేఅవుట్లు చేస్తే కఠిన చర్యలు

- డీఎల్‌పీవో మల్లారెడ్డి
- సంగెం పంచాయతీ రికార్డులు సీజ్

కేశంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా లేఅవుట్లు చేసి ప్లాట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ డివిజన్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) మల్లారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో అక్రమంగా లేఅవుట్లు చేశారనే సమాచారంతో గురువారం కేశంపేట ఎంపీవో కిష్టయ్యతో కలిసి సంగెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీవో సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి సీజ్ చేశారు. పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు వేయకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఉపాధి మిథ్యేనా?

ఉమ్మడి జిల్లాలో 2.36 లక్షల మంది కూలీల తొలగింపు

- మూడేళ్లలో 26.47శాతం మంది ఔట్
- నకిలీ జాబ్‌కార్డుదారులనే తొలగించామంటున్న కేంద్రం
- క్షేత్రస్థాయి సమస్యలతో కొందరు కూలీలు గుడ్‌బై
- కావాలనే తొలగిస్తున్నారని కార్మిక సంఘాల ఆరోపణ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. కొత్తగా చేరే వారి కంటే.. తొలగించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. కొందరు పనులపై ఆసక్తిచూపకపోవడం, పట్టణాలకు వలసలు పెరగడం, నకిలీ జాబ్‌కార్డుల ఏరివేత కారణంగా కూలీల సంఖ్య తగ్గుతోందని కేంద్రం చెబుతోంది. కానీ కఠిన నిబంధనలు, హాజరు శాతం సరిగా నమోదు కాకపోవడం, సమయానికి డబ్బులు ఇవ్వకపోవడంతో కొందరు పనులు మానేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఏదేమైనా మూడేళ్లలో ఉపాధి కూలీల సంఖ్య భారీగా తగ్గిపోవడంతో పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కూలీలకు కనీసం వంద రోజుల పాటు ఉపాధి కల్పించేందుకు గతంలో కేంద్రం అమల్లోకి తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజు రోజుకూ నిర్వీర్యమవుతోంది. కారణాలేమైనప్పటికీ ఉపాధి పనులకు పెద్ద సంఖ్యలో కూలీలు దూరమవుతున్నారు. వివిధ కారణాలతో ప్రభుత్వం భారీగా కూలీలను తొలగిస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 2,36,815 మంది కూలీలను తొలగించింది. అంటే మొత్తం కూలీల సంఖ్యలో ఇది 26.47శాతం కావడం గమనార్హం. కేవలం మూడేళ్ల కాలంలో ఇంత పెద్ద సంఖ్యలో కూలీలను తొలగించడం ఇంతకు ముందెన్నడూ జరగలేదు. అయితే కూలీ పనులపై కొందరు ఆసక్తిచూపకపోవడంతో పాటు పట్టణాలకు వలసలు పెరగడం, నకిలీ జాబ్‌కార్డుల ఏరివేత కారణంగా ఉపాధి కూలీల సంఖ్య తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే కార్మిక సంఘాలు మాత్రం ఇందులో ఇది నిజం కాదని ప్రభుత్వం దశలవారీగా ఉపాధి పనులు తగ్గించేస్తుందని, సమయానికి కూలి డబ్బులు ఇవ్వడం లేదని, కఠిన నిబంధనలు పెట్టి కూలీలకు విషమపరీక్షలు పెడుతోందని

మిగతా 7వ పేజీలో...



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్

పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు

- శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్

షాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : పప్పు దినుసుల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ గౌతంచౌహాన్ అన్నారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో గురువారం కంది పంట క్షేత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలు చేయిస్తే పోషక లోపాలు సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. అలాగే కంది సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, టెక్నికల్ అధికారి రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి వెంకటేశం, సాయివర్ధన్, సాయికుమార్, రైతులు అనంతరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాధవరెడ్డి, సురేష్, రఘు, మాధుసూదన్‌రెడ్డి, మాణిక్యం, వీరమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- వెల్జాల వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భారీ ఏర్పాట్లు

మండల పరిధిలోని వెల్జాల గ్రామ సమీపంలోని శ్రీవేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి(శుక్రవారం) నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న గణపతి పూజ, అఖండ దీపారాధన, లక్షపుష్పార్చన, ప్రదోశ పూజ, స్వస్తివాచనం, గోపూజ, 8న గణపతి పూజ, రక్షాబంధనం, దీక్షాధారణ యాగశాల ప్రవేశం, మంటపారాధనలు, సుదర్శన హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, పుష్పార్చన, ప్రదోశ పూజ, వేద పండితులు కాకునూరి సూర్యనారాయణ మూర్తి ప్రవచనాలు, 9న స్వామివారి కల్యాణం, మహాదీపారాధన, పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

తలకొండపల్లి ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)





విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఐఐఎం కోజికోడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ దేబాశిష్ ఛటర్జీ

భారత్ సిద్ధాంతాలు, ఆలోచనలు అనుసరణీయం

- ప్రొఫెసర్ దేబాశిష్ ఛటర్జీ

శంకర్‌పల్లి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): భారతదేశం అనుసరిస్తున్న సిద్ధాంతాలు, ఆలోచనలు ఎంతో గొప్పవని ఐఐఎం కోజికోడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ దేబాశిష్ ఛటర్జీ తెలిపారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాల 15వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గ్లోబలైజేషన్ ఇండియన్ థాట్- ఇన్‌సైట్స్ ఫ్రం లీడర్‌షిప్ క్రానికల్స్ అనే అంశంపై ప్రసంగించారు. భారత్‌లోని పురాతన సిద్ధాంతాలలో చాలా వాటిని జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించడం సంతోషకరమన్నారు. భిన్న సంస్కృతులు, భాషలు, మతాలకు నిలయమైన ఈ దేశం ఎంతో విజ్ఞానాన్ని కలిగి ఉందని, అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రం తీసిపోదని గుర్తు చేశారు. పేరొందిన బహుళజాతి సంస్థలన్నీ భారతీయుల నేతృత్వంలోనే నడుస్తున్నాయని, దానికి తానెంతో గర్వపడుతున్నానని అన్నారు. తన అనుచరులను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడే వారే నిజమైన నాయకులని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక్ఫాయి కళాశాల కులపతి, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్ ఆన్‌లైన్ ద్వారా ప్రసంగిస్తూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక దేశం నుంచి మరో దేశం నేర్చుకోవడానికి సంకోచించకూడదన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ముందుకు సాగి అభివృద్ధి పథంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఇక్ఫాయి ఉప కులపతి డాక్టర్ ఎల్ఎస్ గణేష్, ఇక్ఫాయి సంస్థ విశిష్ట సలహాదారుడు డాక్టర్ మహేందర్ రెడ్డి, చైర్‌పర్సన్ శోభారాణి యశస్వీ, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ బీజే రావ్, ఇండియన్ బిజినెస్ స్కూల్ మాజీ డీన్ మెండు రామ్మోహన్‌రావు, ఐఎంఐ మొబైల్ ఫౌండర్, జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ సెక్రటరీ విశ్వనాథ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- శాస్త్ర పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్
- నీరజ్ మృతిపై విద్యార్థి సంఘాల ఆందోళన
- నేతల అరెస్టు, పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- షాద్‌నగర్‌లో ఉద్రిక్తత

7



మోసపూరిత మాటలతో కాంగ్రెస్ కాలయాపన

- స్థానిక ఎన్నికల్లో విజయబావుట ఎగురవేద్దాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మంచాలలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం గురువారం మంచాలలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చీరాల రమేష్, బహదూర్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ భువనగిరి పార్లమెంటు ఇన్‌చార్జి క్యామ మల్లేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ ఆరుగ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పథకాలన్నీ పేపర్లకే పరిమితమని.. రైతుభరోసా, పింఛన్ల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మిని అటకెక్కించారని ఆరోపించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులే కనిపిస్తున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా చేసిందేమీలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో లేక క్యాంపు కార్యాలయం మూతపడిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 10లోపు పార్టీ గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటుచేసుకొని ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎం.సికిందర్‌రెడ్డి, బుస్సు పుల్లారెడ్డి, ఏర్పుల చంద్రయ్య, మంకు ఇందిర, జంబుల కిషన్‌రెడ్డి, బద్రీనాథ్‌గుప్త, జానీపాషా, పి.సుకన్య, నర్సింగ్ అనిత, మొగిలి వెంకటేష్, చంద్రకాంత్, మల్లప్ప, మంతని వీరేష్, పల్లె జంగారెడ్డి, నాగరాజు, కరుణాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్ రావు
- పోల్కంపల్లిలో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ సీజ్



పోల్కంపల్లిలో అక్షర క్లినిక్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

ఆదిభట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజోతి): నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో ఓ ఆర్ఎంపీ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం డీఎంహెచ్‌వో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని అక్షర క్లినిక్‌లో అర్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రికి గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశామని తెలిపారు. క్లినిక్‌లో అబార్షన్, డెలివరీ, చిన్న పిల్లలకు చికిత్స చేస్తున్నట్లు గుర్తించామన్నారు. క్లినిక్ నిర్వాహకుడు అందుబాటులో లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని విచారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మధ్యాహ్న వేళలో కలెక్టరేట్‌కు ఆర్టీసీ బస్సు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ సిబ్బంది, టీజీవో నేతల కోరిక మేరకు ఆర్టీసీ యాజమాన్యం కలెక్టరేట్‌కు మధ్యాహ్న వేళలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో టీజీవో నేతలు డాక్టర్ కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా అదనపు బస్సు సర్వీసులను కలెక్టరేట్‌కు నడిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరుతున్నారు. మంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత స్పందించి మిథాని డిపో నుంచి మధ్యాహ్నం కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం 2.40 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలు దేరుతుంది.

ఢిల్లీలో టీడీపీ నేత లోకేష్‌ను కలిసిన లాల్‌కృష్ణ

పరిగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గురువారం దేశరాజధాని ఢిల్లీలో పరిగి ప్రాంత నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ, ప్రభుత్వ పరంగా బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని లోకేష్‌తో నాయకులు కోరారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై జాతీయ స్థాయిలో ఉద్యమం చేస్తామని, అందుకు టీడీపీ మద్దతు ఇవ్వాలని కోరినట్లు లాల్‌కృష్ణ తెలిపారు.


ఏపీ విద్యాశాఖ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కృష్ణయ్య

చేవెళ్ల అభివృద్ధికి రూ.10.40కోట్ల నిధులు

● ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి పంచాయతీరాజ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10.40కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గురువారం చేవెళ్లలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. మొత్తం 196పనులకు ఈ నిధులు వచ్చాయన్నారు. చేవెళ్ల మండలంలో 39పనులు, శంకర్‌పల్లిలో 45, షాబాద్‌లో 39, నవాబ్‌పేట్‌లో 24, మొయినాబాద్ మండలంలో 49చొప్పున పనులకు ఈ నిధులను వెచ్చిస్తామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాస్తామన్నారు. అలాగే చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లోని 24మందికి సీఎం సహాయ నిధి రూ.11.60 లక్షల చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ బి.రాములు, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, జనార్దన్, నరేందర్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, బండారు ఆగిరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.యాదయ్య

ఎల్పీజీ పైప్‌లైన్‌ను కాపాడుకోవడం సామాజిక బాధ్యత

మహేశ్వరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఎల్పీజీ పైప్‌లైన్‌ను సురక్షితంగా ఉంచుకునేందుకు అధికారులతో పాటు పైప్‌లైన్ ఉన్న భూముల రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ బాధ్యతగా మెలగాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎల్‌పీజీ(లిక్విడ్ పెట్రోలియం గ్యాస్) వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని 650 కిలోమీటర్ల పొడవు కర్ణాటకలోన్ హసన్ నుంచి అనంతపురం, కర్నూల్, వనపర్తి, తిమ్మాపూర్ మీదుగా చర్లపల్లి వరకు హెచ్‌పీసీఎల్ జాతీయ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎల్‌పీజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసిందన్నారు. లైన్ రక్షణ, భద్రతపై గురువారం మహేశ్వరం మండలం అమీర్‌పేటలో 'పైప్‌లైన్ భద్రత భరోసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. గ్యాస్ పైప్‌లైన్‌పై మట్టి తొలగింపు, బోర్ల డ్రిల్లింగ్, మొక్కలు నాటడం, భవనాలు నిర్మించడం వంటివి చేయొద్దన్నారు. పైప్‌లైన్ పర్యవేక్షకులకు ప్రజలు, రైతులు సహకరించాన్నారు. ముఖ్యంగా పైప్‌లైన్ ఉన్న ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే సబంధిత సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ ఎల్పీజీ పైప్‌లైన్‌కు ఎవరైనా, ఎలాంటి నష్టం కలిగించాలని చూసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ మిలోంచి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ తరలిస్తూ హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు సరఫరా చేస్తారని, అలాగే జాతీయ రహదారులపై గ్యాస్ ట్యాపింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిప్యూటీ కలెక్టర్ రాములు, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఉదయ్‌కృష్ణ, వైదేహి, ప్రతిమ, శ్రీకాంత్‌రెడ్డి, పుల్లయ్య, జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.


అమీర్‌పేటలో అధికారులతో కలిసి ఎల్పీజీ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఇళ్ల స్థలాలకిచ్చిన సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలిస్తాం : ఆర్డీవో


ఇళ్ల పట్టాలు పొందిన మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కందుకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):కందుకూరు రెవెన్యూ పరిధిలో ఇళ్లులేని పేదలకు పదేండ్ల కింద ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాసర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించి వారికి ఇంటి స్థలం కేటాయించేలా చూస్తామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కందుకూరు పరిధి సర్వే నంబరు 788, 107లలో గతంలో పట్టాలిచ్చిన జాగాలో పొజిషన్లు చూపాలంటూ పేదలు ధర్నా చేశారు. ఆఫీసు వద్ద వంటావార్పు నిర్వహించారు. పట్టాలిచ్చిన స్థలాన్ని పరిశీలించాలంటు నినాదాలు చేశారు. దీంతో తహసీల్దార్ కె.గోపాల్, ఆర్డీవో 788 సర్వే నంబర్ భూమి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో పేదలు, నాయకులతో మాట్లాడారు. ఇక్కడ గుట్టలు, రాళ్లు ఉన్నాయని, ఇళ్లు కట్టుకోవడానికి అనుకూలంగా లేదని వారికి వివరించారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెల్లి, రాళ్లను తొలగింపజేసేలా నివేదికిస్తానని చెప్పారు. అధికారులతో సీపీఎం నాయకులు బాల్‌రాజ్, బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 16ఏళ్ల క్రితం నిరుపేదలకు సర్టిఫికెట్లు ఇచ్చారని, వారికి పొజిషన్ చూపాలని ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలిచ్చామని తెలిపారు. తామే ఇక్కడ సర్వే చేయిస్తామని అధికారులు స్థలం చూపాలని ఆర్డీవోను కోరారు. దీంతో అధికారి కల్పించుకొని మీరు సర్వే చేయించడం ఏమిటని ప్రశ్నించారు. త్వరలో తామే సర్వే చేయిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. 107 సర్వే నంబరులో స్థలాన్ని శుక్రవారం పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో నా యకులు శ్రీశైలం, సిద్ధు, అంజయ్య. చరణ్, పట్టాపొందిన చంచల, అరుణ, ఇందిర, జంగమ్మ, ప్రమీల, రాణి, అలివేలు, శోభ, స్వప్న, రామలక్ష్మి పాల్గొన్నారు.

సీజీఆర్ సంస్థకు భారత్ గౌరవ్ పురస్కారం

కడ్తాల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థకు 'భారత్ గౌరవ్ పురస్కార్' లభించింది. భారత్ వికాస్ సంఘం యేటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి భారతీయ సంస్కృతి ఉత్సవ్ అవార్డులు ప్రదానం చేస్తుంది. కడ్తాల మండలం అన్మాస్‌పల్లికి చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు విరివిగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నందున 2024-25కు గాను అవార్డును ప్రకటించారు. కర్ణాటకలోని కలబురిగి జిల్లా సేడంలో గురువారం నిర్వహించిన వికాస్ సంఘం భారతీయ సంస్కృతి ఉత్సవ్-7లో లీలాలక్ష్మారెడ్డికి పద్మశ్రీ అవార్డీ మంజమ్మ జోగాతి 'భారత్ గౌరవ్ పురస్కార్'ను అందజేశారు. ప్రకృతి పరిరక్షణకు లీలాలక్ష్మారెడ్డి చేస్తున్న కృషిని సంఘం అధ్యక్షుడు కేఎస్.గోవిందాచార్య, బసవరాజ్ పాటిల్, తదితరులు అభినందించారు. అవార్డు రావడం ద్వారా మరింత బాధ్యత పెరిగిందని ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు.


లీలాలక్ష్మారెడ్డికి అవార్డు అందజేస్తున్న మంజమ్మ

పరిమళించిన మతసామరస్యం

● శివ స్వాములకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసిన ముస్లింలు


శివస్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ముస్లింలు

కేశంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వలో మతసామరస్యం పరిమళించింది. శివమాలధారులకు ఆదే గ్రామానికి చెందిన మస్లింలు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు బంటారం రాజుగౌడ్, శీనయ్యల నేతృత్వంలో భక్తులు శివమాలను ధరించారు. వీరు 42రోజుల పాటు దీక్ష చేస్తారు. మధ్యాహ్నం పూట మాత్రమే భోజనం చేసి దీక్షను కొనసాగిస్తారు. గురువారం శివస్వాములకు మహ్మద్ సల్వార్, అఫీజ్, జహంగిర్ బాబ, ఇమ్రాన్ మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయించి వడ్డించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మనోహర్‌గౌడ్, శ్రీకాంత్, ఆనందరెడ్డి, గణేష్, స్వాములు మహేష్, బిక్షపతి, అశోక్, బాల్‌రాజ్, రాఘవేందర్, శీను, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దర్గా వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

ఆమనగల్లు , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఉన్న దావలి పాషా దర్గా వద్ద గురువారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం నివాసం నుంచి గంధోత్సవ ర్యాలీ ప్రారంభమై పురవీధుల గుండా దర్గాకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ వేడుకలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగిని శ్రీనివాస్, నర్సింహ, చారి, దినేశ్, సాయి, మహేశ్, జంగయ్య, నాగేశ్, శ్రీకాంత్, మైనార్టీ నాయకులు దావుల్ పాషా, షకీల్, షరీఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల అరెస్టు అక్రమం

» బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వీఆర్ఏ వారసుల సంఘం నేతలు

వికారాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక 420 అని, ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటిని కలిసేందుకు వచ్చిన వీఆర్ఏలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారికి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండొద్దని వీఆర్ఏలను ప్రభుత్వం విలీనం చేసిందన్నారు. 3,797 మంది వీఆర్ఏ వారసులు ఇంకా ఉన్నారన్నారు. 14 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంకా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 81, 885 జీవోలు అడిగేందుకు వెళ్తే అరెస్టులు చేస్తారా? అంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, శ్రీకాంత్, సంగమేశ్వర్, జనార్దన్, శ్రీనివాస్, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న యాదయ్య

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతది అని, ఈ విషయాన్ని గుర్తిస్తే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించినవారమవుతామని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఈపీవో) రాష్ట్ర కార్యదర్శి ఓ.యాదయ్య అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో ఫ్యాకల్టీ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో మానవ చర్యల ప్రభావం-పర్యావరణ సమతుల్యానికి సవాళ్లు అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని కలుషితం కాకుండా పరిశ్రమల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. గాలి, నీరు, భూమి కలుషితం కాకుండా ఏం చేయాలనేది తెలుసుకుని ఆచరణలో పెట్టాలన్నారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు డా.రచన, సమన్వయకర్త డా.సురేష్, నరేందర్‌రెడ్డి, డా.రమేష్, డా.రాకేష్ భవాని తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వేణుకుమార్ కోరారు. మేడ్చల్ మాల్కాజిగిరి కలెక్టర్‌కు, కీసర ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. పోచారం మున్సిపాలిటీ నారపల్లి రెవెన్యూ పరిధిలోని ఎంఎస్ఆర్ కాలనీ వద్ద గల సర్వేనంబర్లు 56, 58లలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండానే పేపర్లపై లేఅవుట్‌ను రూపొందించి పేదలను మోసం చేస్తున్నారని తెలిపారు. కోలా మహేష్, సదానందం తనకు ప్లాట్‌నంబర్లు 25, 26 గ్రామపంచాయతీ అనుమతి ఉన్న లేఅవుట్ అని నమ్మించి తన నుంచి రూ. మూడు లక్షలు తీసుకున్నారని వాపోయాడు. రెవెన్యూ అధికారులను విచారిస్తే ఇది ప్రభుత్వ స్థలమని అందులో క్రయ విక్రయాలు చెల్లవని చెప్పినట్లు తెలిపారు. వారిద్దరిని తిరిగి డబ్బులు చెల్లించాలని నిలదీస్తే మూడేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇరువురిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

మార్కెట్ అభివృద్ధికి రూ.2.30 కోట్లు

వికారాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ.2.30 కోట్లు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండీ. ఫసియొద్దీన్ తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసన స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ చొరవతో మార్కెట్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఇకపై మార్కెట్ వారానికి ఐదు రోజులు పని చేస్తుందని వివరించారు. ఇప్పటి వరకు వారంలో సోమ, గురువారాలలో మాత్రమే మార్కెట్‌లో బీట్లు జరిగేవన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి రవి, మార్కెట్ సూపర్‌వైజర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో బోర్డు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనంబర్లు 747, 750లోని లక్ష్మీనగర్ కాలనీ పార్కుస్థలంలో హైడ్రా అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో కొందరి ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రోడ్లు, పార్కులు, చెరువులు, కుంటలు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు.



పార్కుస్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

» శాస్త్ర పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్

» నీరజ్ మృతిపై విద్యార్థి సంఘాల ఆందోళన

» నేతల అరెస్టు, పోలీస్ స్టేషన్‌కు తరలింపు



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వేలకు వేలు ఫీజులు తీసుకుంటూ విద్యార్థుల జీవితాలతో శాస్త్ర పాఠశాల యాజమాన్యం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. విద్యార్థి నీరజ్ ఆత్మహత్యను నిరసిస్తూ గురువారం పట్టణంలోని ఆపాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గేటు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు, ఆందోళన కారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్తత నడుమ తోపులాట జరిగింది. అనంతరం పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శాస్త్ర పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపైనా కేసు నమోదు చేయాలన్నారు. అలాగే ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ జిల్లా కన్వీనర్ సూర్య ప్రకాశ్ ఆధ్వర్యంలోనూ ఈ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నీరజ్ కళ్లు దానం

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నీరజ్ కళ్లను కుటుంబసభ్యులు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు దానం చేశారు. గురువారం బాలుడి మృతదేహానికి ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారికి, బంధువులకు అప్పగించారు. అయితే షాద్‌నగర్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడి తండ్రి కోరమోని హరిభూషణ్ బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు కాగా ఆయన్ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, పలు పార్టీల నేతలు తదితరులు పరామర్శించారు.

పీఆర్‌టీయూ అభివృద్ధికి కృషి

షాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ అభివృద్ధికి కృషి చేస్తామని ఆసంఘం మండల అధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ యూనియన్ డైరీ, క్యాలెండర్లను సంఘం సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సుశీల, నర్సింహులు, సింహాద్రి నాయుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చౌదరిగూడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్.. తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, రెవెన్యూ సిబ్బంది వెంకటేష్, రామస్వామి, జంగయ్య, ప్రవీణ్‌కుమార్, రాజు, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ఆమనగల్లు , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 4వ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి 70 టీంలు పాల్గొన్నాయి. కాగా, ముగింపు వేడుకలకు గోదాదేవి సత్యం, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, ప్రిన్సిపాల్ మహమూద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

- పురుషుల విభాగంలో.. మొదటి బహుమతి ఆకుతోటపల్లి టీంకు రూ. 20,116, రెండో బహుమతి జడ్చర్ల టీంకు రూ. 10,116, మూడో బహుమతి చంద్రన టీంకు రూ.5,116.
- మహిళా విభాగంలో.. మొదటి బహుమతి సాట్స్ అకాడమీకి రూ.20,116, రెండో బహుమతి కోటి ఉమెన్స్ కళాశాల టీంకు రూ. 10,166, మూడో బహుమతి కరీంనగర్ టీం కు రూ. 5116, నాల్గో బహుమతి సత్యం టీం కు రూ. 5116 లు నగదుతో పాటు షీల్డ్‌లను గోదాదేవి సత్యం అందజేశారు.

పీఈటీలు మహమూద్, ప్రసాద్, మల్లేశ్, సురేశ్, స్థానిక నాయకులు యాదయ్య గౌడ్, వెంకటయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



కప్పు అందజేస్తున్న గోదాదేవిసత్యం, పాపిశెట్టి రాము

వారంలోపు ప్రభుత్వ భూమి వివరాలివ్వండి

» లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తా

» మాజీ ఎమ్మెల్యే నర్సింహులు



షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్‌నగర్ గ్రామ శివారులో గల సర్వే నంబరు 171లో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం షాద్‌నగర్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్వే నంబరు 171లో 5 ఎకరాల 8 గుంటల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో కొంత స్థలంలో ప్రభుత్వం గోడౌన్లను నిర్మించి, మరికొంత భూమిని రామలింగేశ్వర గొర్రెల పెంపక కేంద్రానికి కేటాయించిందని పేర్కొన్నారు. మిగిలిన భూమిలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. అలాగే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పై సర్వే నంబరు వద్ద వంకరగా ఉన్న రోడ్డు సరిచేసేందుకు స్థలం పోనూ ఇంకా మిగిలే ఉందని తెలిపారు. ప్రస్తుతం పై సర్వే నంబరులో ఉన్న భూమితో పాటు మిగిలిన పాత జాతీయ రహదారి స్థలం సైతం ఆక్రమణలకు గురవుతున్న విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అలాగే ఇళ్ల నిర్మాణాల కోసం ఎవరెవరికి ఎంత స్థలం, ఏ అర్హతతో కేటాయించారో చెప్పాలని 2024 మార్చి 22న తహసీల్దార్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా నేటి వరకు వివరాలివ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బీ అధికారులు స్పందించకపోవడంతో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. వారం రోజుల్లో రెవెన్యూ శాఖ నుంచి సరైన వివరాలివ్వకపోతే కోర్టు ఆశ్రయిస్తానని, ప్రభుత్వ స్థల పరిరక్షణ కోసం పోరాటం చేస్తానని నర్సింహులు హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి



తాటిపర్తి ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

యాచారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటిపర్తి గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేసి ఓటీపీ అడిగితే కాల్ డిస్‌కనెక్టు చేసి వెంటనే సమీపంలోని పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడరాదని యువతకు సూచించారు. ఉన్నత చదువులు చదివి గ్రామానికి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ఆన్‌లైన్ గేమ్ ఆడి ఎంతోమంది యువకులు తనువు చాలించారనే విషయం గమనించాలన్నారు. ప్రతీసోమవారం ఇబ్రహీంపట్నం రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాదర్బార్‌లో అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్సై తేజంరెడ్డి ఉన్నారు. కాగా సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బీసీ కులగణన సర్వే ఓ బూటకం

తాండూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కులగణన సర్వే నివేదిక పూర్తిగా బూటకమని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014లో సమగ్ర కుటుంబసర్వేలో 51 శాతంగా ఉన్న బీసీల సంఖ్య ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సర్వే నివేదికలో 46 శాతానికి కుదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓసీల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించడం హేయమైన చర్య అని అభివర్ణించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడే కుట్ర చేస్తూ బీసీలను దగా చేస్తున్నారని మండిపడ్డారు. రీసర్వే చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసి చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆపదలో 100కు డయల్ చేయండి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారు ఎవరైనా సరే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఎస్ఐ వెంకట్ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల అక్రమ రవాణా, బాలకార్మికులు, బలవంతంగా వ్యభిచార గృహాలకు అమ్మేయడం, ప్రయాణంలో మహిళల భద్రతపై రాచకొండ యూనిట్ ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలం ఓగీపూర్, చంద్రవంచ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తాండూరు ఏసీడీపీవో శ్రీలక్ష్మి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఓగీపూర్ అంగన్‌వాడీలో చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీలను సమయానుకూలంగా కొనసాగించాలని టీచర్లను ఆదేశించారు. చంద్రవంచ అంగన్‌వాడీలో 18 మంది చిన్నారులు ఉన్నారని, ప్రస్తుతం కేంద్రాల్లో పౌష్టికాహారం అందుబాటులో ఉంచామని తెలిపారు.



అంగన్‌వాడీలో ఏసీడీపీవో శ్రీలక్ష్మి

అక్రమ హోర్డింగులను తొలగించాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తొలగించాలని మాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగరావు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌లోని ప్రధాన రహదారితోపాటు పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ భర్త ముల్లి జంగయ్య యాదవ్, అప్పటి మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీ, మేనేజర్ ఇష్టానుసారంగా హోర్డింగులు ఏర్పాటు చేయించారన్నారు. మార్చి 2024 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిషేధం అమలులో ఉన్నా గానీ అనుమతులు లేకుండా పలుచోట్ల ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. అధికారులు స్పందించి నిబంధనలను అతిక్రమించి ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని పేర్కొన్నారు.

సాగుపై అవగాహన అవసరం

ధారూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటల సాగు పై రైతులకు అవగాహన అవసరమని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని నాగారం, దోర్నాల్ గ్రామాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పొలాలను వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరి పంటలో మొగిపురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

నిధుల కేటాయింపు హర్షణీయం

దోమ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయమని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు అంతిరెడ్డి అన్నారు. మండలంలోని బొంపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.9లక్షలతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, సురేశ్, జాఫర్, బాల్‌రాజ్, రాము, రమేశ్, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ పార్లమెంట్ ఇన్‌చార్జి సోమారపు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్‌పటేల్, నర్సింహ, సామేల్, మోసిన్, అభి, శ్యామ్‌సంగ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలు కూల్చుతున్న అధికారులు

కీసర రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం టీపీవో శ్రీదేవి మున్సిపల్ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణదారులు బీపాస్, హెచ్ఎండీఏ ద్వారా అనుమతులు పొంది కట్టడాలు చేపట్టాలని సూచించారు.

ఉపాధి మిథ్యేనా?

(ఐదో పేజీ తరువాయి)

కొందరు పనులు చేయలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో 2022 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 1.55 కోట్ల మంది కూలీలను తొలగించినట్లు ఇటీవల కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయక మంత్రి కమలేష్ పాశ్వాన్ లోక్‌సభలో వెల్లడించారు. నకిలీ పత్రాలతో తప్పుడు జాబ్‌కార్డులు పొందిన వారు, వలస వెళ్లినవారిని తొలగించామని చెప్పారు. అలాగే అనేక గ్రామీణ ప్రాంతాలను పట్టణాలుగా వర్గీకరించడం వల్ల ఆ ప్రాంతాలను ఉపాధి పథకం నుంచి మినహాయించడం వల్ల కూలీలు తగ్గినట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే ఏడాదిలో ఒక్క రోజు కూడా పనిచేయని వారి జాబ్ కార్డులు కూడా రద్దుచేస్తుంటారు. అయితే వీరి స్థానంలో కొత్తవారు కూడా వస్తుంటారు. కానీ గడిచిన కొన్నేళ్లుగా ప్రతి ఏటా కొత్తగా జాబ్‌కార్డులు పొందే వారి సంఖ్య కూడా క్రమేపీ తగ్గుతోంది. కారణాలేమైనప్పటికీ ఉమ్మడి జిల్లాలో గడిచిన 2022 నుంచి ఇప్పటి వరకు 74,775 జాబ్‌కార్డులు రద్దుచేశారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో 2,36,815 మంది కూలీలను తొలగించారు. ఉమ్మడిజిల్లాలో మొత్తం 8,95,144 ఉపాధి కూలీలు ఉండగా.. ఇందులో 26.45శాతం మందిని ఆయా కారణాలతో తొలగించేశారు. ఇందులో అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 1,35,586 మంది కూలీలను తొలగించారు. రంగారెడ్డి జిల్లాలో 96,428 మంది , మేడ్చల్ జిల్లాలో 4,802 మంది కూలీలను తొలగించారు. జాబ్ కార్డుల ప్రకారం చూస్తే రంగారెడ్డిజిల్లాలో అత్యధికంగా 40,457 జాబ్‌కార్డులు తొలగించడం గమనార్హం.

అనేక సమస్యలు

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు భారీగా తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. నకిలీలు ఏరివేతతో పాటు వలసల పేర్లు తొలగించడం, పట్టణీకరణ కారణమని ప్రభుత్వం చెబుతోంది. ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామీణ ప్రాంతాలు పట్టణాలుగా మారినమాట వాస్తవమే అయినప్పటికీ ఇదంతా 2022 కంటే ముందే ఏర్పాటయ్యాయి. 2022 తరువాత పెద్దగా పట్టణ ప్రాంతాలు ఏర్పాటు కాలేదు. కూలీలు క్షేత్రస్థాయిలో సరికొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రతీ వారం కూలీలకు డబ్బు చెల్లించాల్సి ఉండగా, సకాలంలో అవి అందడంలేదు. కనీసం రెండు నుంచి మూడు వారాలు ఆలస్యంగా డబ్బులు వస్తున్నాయి. దీనికి తోడు ఉపాధి హామీ పథకంలో అవతవకలు నివారించేందుకు ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన హాజరువిధానం సరికొత్త సమస్యలు సృష్టిస్తోంది. సర్వర్ సమస్యల కారణంగా కూలీల హాజరు నమోదు సక్రమంగా జరగడం లేదు. దీంతో ఉపాధి కూలీలకు చేసిన పనికి డబ్బులు వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ఇటీవల అమల్లోకి తెచ్చిన ఎన్ఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) విధానం ప్రకారం కూలీల హాజరుతో పాటు పనిచేసిన చోట ఫొటోలను రెండు పూటలా తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సదుద్దేశంతో ఈ విధానం అమల్లోకి తెచ్చినప్పటికీ సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్ సమస్యల కారణంగా ఈ పని సక్రమంగా జరగడం లేదు. కొత్త విధానంలో రెండు పూటల హాజరు శాతం నమోదు చేయాల్సి ఉండగా ఒక్కో పూట సర్వర్ కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక పూట హాజరు పడితే మరో పూట పడడం లేదు. సిగ్నల్స్ ఎప్పుడు ఉంటాయో తెలియదు. సిగ్నల్స్ ఉన్నా సర్వర్ పనిచేయడం లేదు. గతంలో ఒక్క ఐడీ కింద 20 మంది కూలీలు దాటితే కూలీల బృందం ఫొటో తీసుకుంటే సరిపోయేది. కానీ ఇపుడు ప్రతీ ఒక్క ఐడీకి ఒక ఫొటో తీసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సమస్యలతో కూలీలు అవస్థలు పడుతున్నారు.

2022 నుంచి ఇప్పటి వరకు కూలీలు, జాబ్‌కార్డుల వివరాలు

జిల్లా	జాబ్‌కార్డులు జారీ	తొలగించిన కార్డులు	మొత్తం కూలీలు	తొలగించిన కూలీలు
రంగారెడ్డి	1,99,681	40,457	3,58,290	96,427
వికారాబాద్	2,17,619	30,692	5,12,762	1,35,586
మేడ్చల్	21,445	3,626	24,092	4,802

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్

కడ్తాల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించి అమలు చేస్తుందని పేర్కొన్నారు. కడ్తాల మండలం గడ్డమీది తండాలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్‌పతి నాయక్‌తో కలిసి ప్రారంభించారు. నిర్వాహకులు ఇస్లావత్ పాండునాయక్, నేనావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో మైసిగండి ఉమ్మడి పంచాయతీ పరిధిలోని తొమ్మిది తండాల క్రీడాకారులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రతిఒక్కరూ చేయూతనందించి ప్రోత్సహించాలని సూచించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు చందోజీ, జవహర్ లాల్, హీరాసింగ్, రాజునాయక్, తులసీరామ్, రమణ, పంత్య, రవి, బాల్‌రామ్, యాదగిరి, సురేశ్, మల్లేశ్, రాంజీ, సుదీర్, రవి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జింకల భాస్కర్

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన భాస్కర్

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రేవంత్ మిత్రమండలి జిల్లా నాయకుడు, మాడ్గుల మండల అధ్యక్షుడు జింకల భాస్కర్ గురువారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌తో కలిసి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ, శాసనమండలి, కాబినెట్‌లో పెట్టి ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ప్రత్యేక పూజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఐదు రోజులపాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా చక్రతీర్థం, ప్రదోషపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, అర్చకులు గూడ కృష్ణమాచార్యులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయం వద్ద భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

టార్గెట్ పూర్తి చేయాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య గ్రూపులు ఈ ఆర్థిక సంవత్సరంలోపు వందశాతం టార్గెట్లను పూర్తి చేయాలని ఏపీఎం నర్సింహ అన్నారు. గురువారం చౌదరిగూడ మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బ్యాంకు లింకేజీ టార్గెట్ రూ.23 కోట్లుకు మొత్తం గ్రౌండిగ్ చేశామన్నారు. టార్గెట్లను పూర్తి చేయడానికి వీవోఏలు, సీసీలు కృషి చేయాలన్నారు. సమావేశంలో మంజుల, లక్ష్మి, దేవయ్య, రమేష్, స్వర్ణలత, స్వరూప పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో తాగునీటి సమస్య పరిష్కరించి గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో గురువారం కేశవులు పర్యటించారు. మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, స్థానికులతో కలిసి తాగునీటి కులాయిలు, పైపులైన్లను పరిశీలించారు. అవసరమైన చోట గేట్ వాల్స్ ఏర్పాటు చేయాలని, పైపులైన్ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని తెలిపారు. ఆయనవెంట నాయకులు రాగ్యనాయక్, గోపాల్‌నాయక్, రవి, రమేశ్, లక్ష్మణ్, మల్లేశ్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది మోహిన్, గోవింద్, షర్పు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆమనగల్లు , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తికి మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పర్యటించారు. హరితహారం నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం గురించి కమిషనర్ శంకర్‌నాయక్, సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం విషయంలో ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాన్గుమర్ల తండా కు చెందిన నేనావత్ రవి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యనాయక్, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మణ్ లు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఒక్కొక్కరు రూ.5 వేల చొప్పన ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు పాండు నాయక్, శంకర్ నాయక్, భీమన్, శ్రీను, సక్రు, రూప్‌సింగ్, రాజు ఉన్నారు.

వర్గీకరణతో మాలలకు అన్యాయం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు నేతలు

నల్ల బ్యాడ్జీలతో మాలమహానాడు నేతల నిరసన

కందుకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని ఆ సంఘం మండల నాయకులు గుయ్యని సామయ్య, గాదె యాదగిరి, పాండు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంఘం నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన వీదుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2004లో ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, 2024 ఆగస్టు 1న అదే కోర్టు వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని తీర్పునివ్వడం చూస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొత్తులుగా మారినట్లు భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 30 శోల జనాభా ఉన్న మాలలను కేవలం 19 లక్షలకు కుదించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పులతడకగా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, రవి, రమేష్, గణేష్, రవి, రాజు, రమేష్, భరత్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలకు 61 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆ సంఘం నాయకులు ఎగ్గిడి సత్తయ్య, సోమరాజు వెంకటేష్, అనేగౌని రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం నాయకులుతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభాలో 61 శాతం ఉన్న బీసీలకు అదే తరహాలో ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. మండంలోని నేదునూరు గ్రామంలో 85శాతం బీసీ జనాభా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వరుణ్‌కుమార్, మైసయ్య, యాదగిరి, శివగౌడ్, నవీన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బట్టీ వద్దు.. ఇష్టంతో చదవాలి



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న విజయ్

యాచారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షల కోసం జవాబులను బట్టీ పట్టకుండా అర్థం చేసుకుంటూ ఇష్టంతో చదివితే గుర్తుంటుందని ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధి విజయ్ అన్నారు. గురువారం యాచారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో అవగాహన కల్పించారు. జవాబులను బట్టీపడితే చదివింది జ్ఞాపకముండదన్నారు. పరీక్షలంటే భయపడొద్దని, ఐదుగురు కలిసి గ్రూప్‌గా ఏర్పడి చర్చించుకుంటూ చదివితే ఫలితం ఉంటుందన్నారు. నిరంతరం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటలు ఆడితే మెమరీ పవర్ పెరుగుతుందని చెప్పారు. సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కిషన్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, వెంకటేశం. శ్రీనివాస్, లక్ష్మణ్ ఉన్నారు.

కుంభమేళాలో చిల్కూరు ప్రధానార్చకులు



రంగరాజన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పీఠాధిపతి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు హాజరై త్రివేణీసంగమంలో పూజలు, స్నానం చేయడం తనకు దక్కిన అదృష్టమని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. గురువారం మహా కుంభమేళాలో పాల్గొని స్నానం ఆచరించారు. అనంతరం అక్కడే ఉత్తరాంనాయ జ్యోతిష్య పీఠం శంకరమఠానికి చెందిన ముక్తేశ్వారానందసరస్వతి స్వామిజీ ఏర్పాటు చేసిన సంసద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగరాజన్‌కు పీఠాధిపతి జ్ఞాపికను అందజేశారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంషాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసి పోస్టులను పెంచాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఏఎన్ఎంలతో కలసి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల సమస్యలను పట్టించుకోవాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఏఎన్ఎంల సమస్యలను పట్టించుకొని వారి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడిశేఖర్‌రెడ్డి, పద్మ, జయమ్మ, చంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఆమనగల్లులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, జిల్లా నాయకుడు మండ్లీ రాములు, మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. శ్రీనివాస్ రెడ్డి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పట్టణంలో పలు చోట్ల మొక్కలు నాటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీనివాస్ రెడ్డిని పార్టీ నాయకులు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణానాయక్, ఫరీద్, మల్లేశ్, అలీం, ఖాదర్‌ఖాద్రీ, కాళె మల్లయ్య, రాగ్యనాయక్, మైసయ్య, చంద్రునాయక్, మహేశ్, వెంకటేశ్, శివాజీ, నర్సింహ్మ, ఆనంద్, రవీందర్ నాయక్, మల్లేశ్ నాయక్, ఎంగళి ప్రసాద్, కుమార్‌గౌడ్, నాజర్, పాల్గొన్నారు.

గంగా జలంతో చెన్నకేశవ ఆలయంలో పూజలు



గంగా జలంతో పూజలు నిర్వహిస్తున్న గంప వెంకటేశ్, దశరథ్ నాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా నుంచి తీసుకువచ్చిన గంగాజలంతో కడ్తాలలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ భీమనపల్లి ఆనంద్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కడారి రామకృష్ణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ హాజరయ్యారు. గంగ, యమున, సరస్వతి నదుల జలాలను బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయ కమిటీ సభ్యులతో కలిసి చెన్నకేశవ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. పూజల అనంతరం గంగా జలాన్ని ప్రతి ఇంటికీ చేరేలా మంచి నీటి ట్యాంకుల్లో కలిపారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కార్యక్రమం చేపట్టినట్లు వెంకటేశ్ తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, నాయకులు మంగళపల్లి నర్సింహ, జంగారెడ్డి, ఇమ్రాన్‌బాబా, బుచ్చయ్య, మహేశ్, జగన్, అంజి, లాయక్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల వివరాలు నమోదు



పంటల వివరాలు సేకరిస్తున్న ఏఈఓ రాజేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పంటల సాగు వివరాలను సేకరిస్తున్నామని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, ఏఈవో రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అయా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను సందర్శించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో వ్యవసాయ అధికారులు క్లస్టర్ల వారీగా పంటల డిజిటల్ సర్వే చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చే వ్యవసాయ అధికారులకు రైతులు సహకరించి వివరాలు వెల్లడించాలని కోరారు.

దివ్యాంగులకు ఐదు శాతం ఇళ్లు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బంజార దివ్యాంగ ఐక్య సమితి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆమనగల్లు ఎంపీడీవో మాధురికి వినతిపత్రం అందజేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దివ్యాంగుల వాటా ప్రకారం ఇళ్లు కేటాయించాలని కోరారు. బంజార దివ్యాంగ్ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాత్లావత్ రమేశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు వడ్త్యావత్ శ్రీనునాయక్, నాయకులు విజయ్‌రాథోడ్, బిక్కు, రాములు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఘన సన్మానం



కమిషనర్ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న జంగయ్య

ఆమనగల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ నాయక్‌ను గురువారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, డాక్టర్ హేమ్‌లాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలో శంకర్ నాయక్‌ను సత్కరించి అభినందించారు. మున్సిపాలిటీ పరిధిలో వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, పారిశుధ్య కార్యక్రమాల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

యాచారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లికి చెందిన సతీష్(22) బైక్‌పై హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లికి వెళ్తున్నాడు. మండల కాంప్లెక్స్ వద్ద లారీ, క్రూయిజర్లను ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న దేవరకొండ డిపోనకు చెందిన బస్సును ఢీకొట్టడంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు 108లో నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాలేయ సమస్యతో బాధపడుతున్న వ్యక్తిఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడకు చెందిన మంగళి జంగయ్య(45) కొందర్గు బీసీ వసతిగృహంలో కుక్‌గా పనిచేస్తున్నాడు. ఏడాదిగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన నెమలి అప్పగింత

కేశంపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న జాతీయ పక్షిని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. మండలంలోని లింగధన శివారులో గ్రామానికి చెందిన శేఖర్ తన పొలం వద్ద గురువారం నడవలేని స్థితిలో నెమలిని గుర్తించాడు. గ్రామానికి తీసుకువచ్చి ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్ గౌడ్‌కు అప్పగించాడు. ఆయన రేంజ్ ఆఫీసర్ జాకీర్‌హుస్సేన్‌కు సమాచారం ఇచ్చి నెమలిని అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిభట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంటి తలుపులు పగులగొట్టి బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ నాదర్‌గూల్‌లోని గ్రీన్ హోమ్స్ కాలనీలో నివాసం ఉంటున్న హలీమా(50) గత నెల 31న హైదరాబాద్ అత్తాపూర్‌లోని తల్లి ఇంటికెళ్లింది. గురువారం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో నుంచి 20 గ్రాముల 2 బంగారు బిస్కెట్లు, 8 గ్రాముల గొలుసు, 10 గ్రాముల హారం, 2 గ్రాముల ఉంగరం, 25 తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇబ్రహీంపట్నం లయోలా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దీనావన్‌రావు పదో తరగతి చదువుతున్న బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆమె తల్లి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.



తక్కళ్లపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యాచారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామంలో అమలు చేసినందుకు గురువారం గ్రామానికి చెందిన మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యాచారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు గ్రామానికి చెందిన మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు భరోసా కింద ఎకరం భూమి ఉన్న రైతులకు రైతు భరోసా డబ్బు వేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, తీగల నందిని, రామాచారి, పట్నం లక్ష్మయ్య, సురేష్ ఉన్నారు.

24 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కందుకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాన్యగూడలో విద్యుత్ సమస్యను 24 గంటల్లో పరిష్కరించినట్లు విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్‌గౌడ్ అన్నారు. గురువారం మాన్యగూడలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ సమస్యతో కొంత కాలంగా తాగు నీటి ఎద్దడి ఉందని గ్రామస్తులు తెలిపారని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, లైన్‌మెన్ నర్సింహ, నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, నర్సింహ, బాబు, యాదయ్య, యాదయ్య, నర్సింహ, దశరథగౌడ్, రాములు, చంద్రమౌళి పాల్గొన్నారు.

'పాలమూరు' నోరు అదుపులో పెట్టుకో..



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మీకు లేదని, ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని కాంగ్రెస్ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, రఘునాయక్, కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుంటే ఆయనపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ హయాం నుంచే సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ బిల్లులకు నిధులు మంజూరు చేసిన విషయాన్ని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీలో ఉంటూ బీఆర్ఎస్ నేతలతో చట్టాపట్టాల్ వేసుకొని తిరుగతూ వారు చెప్పినట్లు ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ఎమ్మెల్యే ఒక రోల్ మాడల్ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ముడిమ్యాల్ గ్రామ అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముడిమ్యాల్ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ గోపె ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముడిమ్యాల్‌లో ఉపాధి హామీ పథకం, ఎస్డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు, సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యాదయ్య ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రాములు, ఓబీసీ సెల్ మండల అధక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజ్‌కుమార్, బూర్ల సాయినాథ్, వాజిద్, జంగారెడ్డి, శ్రీశైలం, ఖాజా, జనార్దన్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాస్, మహేందర్, శివకుమార్, యాదయ్య ఉన్నారు.